# స్పర్శ

సామాన్యులూ సంసారులూ
పగలు పడిన కష్టం తీర్చుకునేందుకు
నిద్రలోకి జారిపోతున్న -

చట్టాన్ని ధిక్కరించడానికి వెరవని పేకాట క్లబ్బులూ పానశాలలూ చైతన్యం పుంజుకుంటున్న -

తను శవమై తనువు వశం చేసి అయినా సంపాదన కోసం రేయంతా శ్రమించే రేరాణులు విటుల కోసం.. వారిచ్చే డబ్బుల కోసం విరహిణులలా ఎదురుచూస్తున్న -

నెలాఖరు రోజులు కనుక కేసుల కోసమూ కాసుల కోసమూ విధ్యుక్త ధర్మమనే ఎర్ర టోపీలు తగిలించుకుని వేట లాటి డ్యూటీకి బయలుదేరు తున్న -

రాత్రి : పదిగంటలు దాటీ పదకొండు దాటకుండానూ. సానివాడ. వీధంతా గుమ్మాలే గుమ్మానికో ముద్దుగుమ్మా. అలంకరణ తెచ్చిపెట్టిన అందాలు. ముఖంలోని అందం వెనుక కళ్ళనిండా కాటుక కంటే నల్లని భయాలు కంటిపాపల్లో.

రేపటి భయం, బ్రతుకు భయం ఇవాళ తీసుకున్న చీర జాకెట్ల అద్దె చెల్లించగలనా ?

పువ్వులవాడికి పెట్టిన అరువు తీర్చగలనా? పాసింజర్లు..బేరాలు..తగులుతాయా ?

ప్రశ్నలు ప్రశ్నలు ప్రశ్నలు. భయాలు భయాలు భయాలు. వాళ్ళ కళ్ళు వీధి ఆ చివరి నుంచి ఈ చివరి వరకూ సూదుల్లాటి చూపులతో పొడిచి పొడిచి గాలించి వదులుతున్నాయి.

వీధి..రోడ్డు నిర్జనంగా వుంది. వాళ్ళల్లో నిరాశ నిస్పృహ నీరసం.

తెలియని ఎవరి మీదో పట్టలేనంత కోపం. బక్క కోపం. బీద తనపు కోపం. గుండెమంట, అందరిలోనూ అదేమంట.

మనసుని మరిపించేందుకూ గుండెమంటని చల్లార్చుకునేందుకూ మాటలూ కబుర్లే మార్గమని వీళ్ళకి తెలిసిన చిట్కా ఎవరి గుమ్మానికి వారు మరీ దూరంగా పోకుండానే వాళ్ళలో కొందరు దగ్గరగా చేరారు.

"ఏటి ఇయాలా బిజినెస్ మరీ ఇంత డల్లుగా వుండేటి.? ఎప్పుడూ ఇలా లేదు.. నేను వయసులో బిగిగా.. ఫైల్లో వుండగా..అంటే పదీ పన్నెండేళ్ళ కిందట.. ఈవేళకీ వీధి విటులతో ఎలా కిటకిటలాడిపోయేదని ! కలకలలాడి పోయేదని ! ఇప్పుడీ వీధిని చూస్తుంటే రాజుని చూసిన కళ్ళతో రింకు మొగుణ్ణి చూస్తున్నట్లుంది." ఎలాగూ నిద్రపట్టదని ఆ కూర్చునేదేదో గుమ్మంలోనే కూర్చుంటే ఏ నాసిరకం పాసింజరైనా తగలడా అని ఆశా, అలవాటూ చావక ఆమెకూడా తగుదునమ్మా అని వాళ్ళతోపాటు తనూ గుమ్మానికి వేలాడుతూంటుంది. వేశ్యా జీవితానికి పగలంటే రాత్రీ, రాత్రంటే పగలూ కదా !

"మన బేరాలు ఎందుకు తగ్గిపోయాయో.. బతుకులు ఇంతగా ఎందుకు

దిగజారిపోయాయో" ఎవరినో అడుగుతున్నట్లే అంది ఇంకొకామె.

"ఎయిడ్స్" అనేసింది అనార్కలీ. అదామె వృత్తిపరమైన పేరు. అసలు పేరు అమ్మతల్లి. ఆమె చిన్నప్పుడు కొంచెం చదువుకుంది. పెద్దవుతున్నా ఏదైనా కాగితం దొరికితే చదువుతూనే ఉంటుంది. పగటి పూట ఓ షాపువాడి నుంచి నిన్నటి వార్తా పత్రిక అరువుతెచ్చు కొని ఇవాళ చదువుకొని ఇచ్చేస్తుంది, ఓసారి వాడిని వేళ్ళు తాకనిచ్చి. ఆ దుకాణదారుడు అల్పసంతోషి, అతి భయస్తుడూ.

"అలా చిలక పలుకు పలికూరుకుంటే మాలాటోల్లకేటి అర్థమౌతాది. ఇప్పుడెవరూ వచ్చిపడిపోవడం నేదుకాని యివరంగా సెప్పు" రోడ్డుని చూస్తూ అందామె.

విటుల ముందుకి అలంకరించుకొనీ, అసలు పేరూ రూపమూ దాచుకొనీ, ఇంగ్లీషు ముక్కలు అరువు తెచ్చుకొని వొచ్చినా– వాళ్ళలో వాళ్ళ భాషా ఊసులు మామూలే. విటులముందు – వయస్సులో పెద్దదయిన వేశ్య తనకంటే చిన్నదాన్ని కూడా అక్కా అనే పిలుస్తుంది. అది వాళ్ల వృత్తి ధర్మం. కాని మామూలు వేళలో ఆ ముసుగులుంచుకోరు.

అమ్మతల్లి ఉరఫ్ అనార్కలీకి చదవడమంటేనే కాక ఉపన్యాసలివ్వడానికి కూడా ఉత్సాహమేలా ఉంది. సందు దొరికిందే చాలని – "పది పదిహేనేళ్ళ కిందటే మన దేశంలో ఎయిడ్స్ స్పృహ కలిగింది. ఎయిడ్స్ వచ్చిందంటే మనిషి చావలవలిసిందే తప్ప మందులేదు. రాకుండా చూసుకోవల్సిందే తప్ప వచ్చాక ఎవరూ ఏమీ చేయలేరు." అంది.

"అంటే సవాయి (సిఫిలిస్) కంటే ఘోరమైన దన్నమాట. అసలు ఎయిడ్స్ ఎందుకు వస్తది ? ఎలా వస్తది.?"

"ఆ జబ్బున్న వాళ్ళతో కలిస్తేనూ, ఆ జబ్బున్న వాళ్ళకిచ్చిన ఇంజక్షన్ సూదితోనే మరొకరికి ఇస్తేనూ .. రక్తం ద్వారానూ.. ఆ జబ్బున్న ఆడది కనే పిల్లలకి."

"అంతెందుకు కాని ఏదైనా మన కర్మకాలితే వస్తుంది"

"కడుక్కుందుకు నీళ్ళు లేవని తెలిసీ చూస్తా చూస్తా అడుసులో కాలేస్తామా ?"

" ఆ మధ్య టివిలో సినిమా చూస్తూంటేనూ మధ్యన ఎయిడ్స్ గురించి చెప్పారు."

టివి ఒక్కటేకాదు పేపర్లో ప్రకటనలలో ప్రభుత్వం ఎయిడ్స్ బూచి గురించి తెగచెబుతూ ప్రజల్ని తెగ భయపెట్టేసి వదిలేస్తూంది. మితిమీరిన ప్రచారంతో – ఆడామగా ఒకళ్ళని ఒకళ్ళు చూసుకున్నా ఎయిడ్స్ వచ్చేస్తుందేమో అని ప్రజలు బెదిరిచస్తున్నారు. అందమ్మ తల్లి.

"మన జనాలొట్టి ఎర్రి గొర్రెలు ఎవరేం చెబితే అదే నిజమనేసుకోవడం తప్ప సొంతబుర్ర పెట్టి ఆలోచించరు. చెప్పే వాళ్ళకి లేకపోతే వినేవాళ్ళకైనా వివేకముండొద్దు ? చావెవరి చేతిలో అయినా వుందా ? నుదుట చావు రాసి పెట్టుంటే ఎయిడ్సే అక్కర్లేదు. ఎండుచేప చాలు – హంసెగిరిపోయి దీపమారిపోవడానికి. మన భ్రమకానీ చావుకి కారణం ఉండాలా?" "మా బాగా చెప్పేవు. అసలు నన్నడిగితే బతుకు రబ్బరు బుడగ. ఎప్పుడైనా పేలిపోవచ్చు. అంచేత బతికినన్నాళ్ళూ భోగమనుభవించెయ్యాలి.

దంచినమ్మకి బొక్కిందే కూలి" వేశ్యలకి వేదాంతముంటుంది. వుండాలి కూడా.

"అయితే మన వృత్తినీ పొట్టనీ కొడుతున్నది ఎయిడ్స్ అన్నమాట"

" ఈ ఎయిడ్స్ బుగ్గెత్తిపొయ్య"

"తాగినోళ్ళో తెగించి నోళ్ళో తప్ప మన దగ్గరికి రావడానికి జనం జంకుతున్నారన్నమాట"

అసలు ప్రభుత్వం ఆడా, మగలని కలవొద్దన్లేదు. నిరోద్ పెట్టుకోమందంతే. అది అర్థం చేసుకోక చీమలున్నాయని ఇల్లు తగలెట్టుకునే వెర్రివాళ్ళలా ప్రజలు బోగందంటేనూ ఆడదంటేనూ ఎయిడ్స్ అనేసుకుని వణికిపోతున్నారు.

ఎయిడ్స్ కోసమేనా మీ చింత ? నిరోధ్ వున్నది మా చెంత.

ప్రపంచ విటులారా ! నిరోధులుకండు. కవచం - మీ సుఖానికి అభయం" నినాదంపాడింది అనార్కలీ.

"ఎవరో పాసింజరొత్తన్నట్లున్నాదే"

ఒక్కసారి వాళ్ళందరూ అటు చూశారు.

వీధి మొదట విద్యుద్దీపం కింద లీలగా అస్పష్టంగా మానవాకారం.. మగరూపం.. ఎవరి గుమ్మానికి వారు చేరుకుంటూంటే. -

"శోభనానికి వస్తూ పెళ్ళి నడకలు నడుత్తారేమిటి? ఆరాట పెళ్ళి కొడుకు పేరంటాలి మెళ్ళోనే పుస్తెకట్టి వాటేసుకున్నాడన్నట్లు ఎంత హుషారుగా వుండాలి సానివాడకొచ్చేటప్పుడు " అంటూ విసుక్కుందొకామె.

అతను మెల్లగా నడుస్తూ ఒక్కొక్క గుమ్మం వైపు చూసుకుంటూ ... ఆగబోతూ...అంతలోనే అడుగు ముందుకి వేసేసత్తూ.. వాళ్ళని దాటిపోతూంటే. - వీళ్ళ ఆశలన్నీ నిరాశలైపోయి నిప్పులమీద నీరుపడి ఆవిరైనట్లు నిట్టూర్చారు. ముందున్నది ముసళ్ళ గడపని తెలవదు కాబోలు..

"అసలు అతను మన పాసింజరో రైలు పాసింజరో.."

"తొంబైయేళ్ళ మగతొక్కు క్కూడా తొమ్మిదేళ్ళ గుంటే కావాలి. వయసు, బిగి, ముసిల్తనం, మూలపడ్డం ఆడదానికే కాని మగాడికి పెట్టని ఆ దేవుడ్ని అనాలి. ఆ దేవుడూ మగాడే"

" ఎల్లెల్లు ఏట్లోకెల్లు" శపించిందొకతె.

అతను ఆమాటలేవీ వినిపించుకోకుండా మెల్లగా ముందుకి సాగిపోయాడు.

ఆ గుమ్మం ముందు మెట్లమీద ఒకామె కునుకు పాట్లుపడుతోంది ఓ కంట చూస్తూనే.

వీధి దీపం కాంతి ఆమె మీద బాగానే పడుతోంది. స్పష్టంగా కనిపించేలా. అతను మగాడు. ఊహించనిదేదో జరుగుతున్నట్లు ఒక్కసారి లేచి నిలుచుని "రండి బాబూ ! రండి సందేహించకండి వృత్తి చేసేది నేననుకుంటున్నారేటి ? కాదు బాబూ నా కూతురి కూతురు. మనవరాలు. వయసులో వుండి పిటపిటలాడిపోతుంది. రంభలాంటి అందగత్తె. సినిమా స్టార్లకంటె చక్కగా వుంటుంది." అంటూ ఊరించింది. వేశ్యలవి రెండు భాషలూ, రెండు బతుకులూ.

"నీకు ఎలా చెప్పాలో తెలియడం లేదు" ఒక్కసారాగి మెల్లగా అన్నాడు. "నాకు నువ్వే కావాలి" అతని కంఠంలో తడబాటు. తప్పు

చేస్తున్న భావన. శరీరంలో వణుకు తను ఎండమావిలోనో మురికి గుంటలోనో దాహం తీర్చుకోవాలనుకోలేదు కదా ! అనూహ్యమూ అసంభవమూ అయినదేదో ఎదురైనట్లామెతుళ్ళి పడింది. ఆశ్చర్యం పట్టలేకపోయింది. "బాబూ! మీరు సరిగా చూడనట్లుంది నన్ను" అంటూ మరింత బాగా కనిపించేలా కాంతిలోకి జరిగింది. "నేను పొరపాటు పడడంలేదు. నా దృష్టి బాగానే ఆనుతుంది. నాకు..నువ్వే.. కావాలి." ఖచ్చితంగా చెప్పాడు. అదివిని ఆమె ఆశ్చర్యపడిపోయింది. ఒక్కసారి సిగ్గుతో ముడుచుకుపోయింది.

ఏనాటి ముచ్చటది ! పడకలో పురుషుడిని మరిచేపోయింది. ఈయన కోరిక నిజమేనా !

"నువ్వు ముసలమ్మవీ, నేను ముసలయ్యనీ, కాదూ ! నవ్వుతూనే అడిగాడు.

ఆమె ఆలోచనలోనూ సంఘర్షణలోనూ పడ్డట్లుంది.

ఈ వయసులో తలపండిన తాను తగుదునమ్మా అంటూ మగాడికి తలుపేసి పడకచేస్తే తనవాళ్ళు ఏమనుకుంటారు. ఎంత భోగం కులమయినా ? నలుగురూ నవ్వరూ ? ముఖాన పేడనీళ్లు జల్లరూ?

జల్లితే జల్లనీ.. నవ్వుకుంటే నవ్వుకోనీ. ఈ నవ్వే వాళ్ళు ఎవరైనా తనకోపూట అన్నం పెడతారా.. కారాకిల్లీ కొనిపెడతారా ? వీళ్ళనెందుకు లెక్కచెయ్యాలి.?

అతను ఎందుకో తననే కావాలనుకుంటు న్నాడు. తను ఇంత ముసిలయినా ఓ మగాడికి నచ్చడమూ అతని మెప్పు పొందడమూ ఏనాడో తన ఆడతనం చేసుకున్న అదృష్టమే. ఇలాంటి వరం ఎందరికి? ఊ అంటే పదోపరకో చేతిలో పడుతుంది. ఓ పూటో రోజో కడుపు నిండుతుంది. ఎందుకు వదులుకోవాలి ? కాళ్ల దగ్గరకొచ్చిన బేరం. తానే కోరుకుంటున్నాడు. కానీ తనేమీ అడగలేదుగా?

ఒక నిశ్చయానికి వొచ్చినట్లు "మీరంతగా పట్టుపడుతూ నన్నే కావాలంటుంటే నేనెందుకు కాదనాలి? పెద్ద వారిమాటలను కాదనే బుద్ధి మాయింట లేదు. ఎవరే ముచ్చటపడితే అది తీర్చడమే కదా మా వంతు.. సరే.. రండి" అంది.

"నా దగ్గర ఏభై రూపాయలున్నాయి"

"మీకు ఇలా సానివాడకి రావడం తొలిసారా"

"ఊ" "మీ ఇష్టమొచ్చినంతివ్వండి. మీరేమిచ్చినా నాకు మహానందమే పోనీ ఏభైయ్యే ఇవ్వండి. ఇంకా వీధిలో ఎందుకూ ? పాపిష్టి కళ్ళూ పడతాయి రండి ?" అంటూ దారిచూపుతుంటే అతనామె వెంట నడిచాడు. అడుగులు తడబడుతున్నా.

వీధిలోకే ఉన్న గదిలో దీపం వేసి.. అతిధిని మంచం మీద కూర్చోబెట్టి ఆమె లోపలికి వెళ్ళింది "ఇప్పుడే వస్తా" అంటూ.

నిముషం పోయాక లోపలి నుంచి స్నానం చేస్తున్న చప్పుళ్ళు. నిరీక్షణను భరించలేక అతను కనురెప్పలని గట్టిగా మూసుకున్నాడు.

స్త్రీ, అందులోనూ వేశ్యా వృత్తి తెలిసినది... ఏ వయసులో అయినా .. మగవాడి దగ్గరికి చేరాలంటే కొంచెమైనా అలంకరించుకోనీ శుభ్రంగానూ తప్పరాదు కాబోలు. ఆమె మళ్ళీ

ఆ గదిలోకి అడుగుపెట్టేసరికి కొత్త మనిషిలాగే వుంది.

స్నానం చేసిన జుత్తు దానిలో ఏవోపూలు, పౌడరు రాసుకొని బొట్టుపెట్టుకున్న మొహం, చేతులకి రెండేసిగాజుల శరీరం నుంచి ఏదో సెంటు తాలూకూ పరిమళం.

ఆ పరిమళానికి అతను కళ్ళు తెరిచాడు. ఆమె అతనికి తగులుతూ దగ్గరగా కూర్చుంది. అతనామె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు, అరాటంగా. ఆమె గతుక్కుమంది. "అబ్బ ! ఎంత వేడిగా వుంది మీ చెయ్యి ! జ్వరమా !" నుదుటి మీద చెయ్యి వేసింది అతను కళ్ళు మూసుకున్నాడు హాయిగా ఉన్నట్లు.

"ఏదీ వెన్ను చూడనివ్వండి ఉష్ణమేమో" అతని వెన్నుమీద చేయివేసి నిమురసాగింది. అతని కళ్ళల్లోంచి కన్నీళ్ల ధారలు.

"కంటతడి పెడుతున్నారా ! ఎందుకూ! ఏమైందనీ" జాలిగా ప్రేమగా అడుగుతూ అతని తలని తన గుండెలకదుముకుంది. ఆ స్థితిలో కొన్ని నిమిషాలు ఈ లోకంనుంచి మరోలోకం లోకి వెళ్ళిపోయినట్లు ఇద్దరికిద్దరూ ఏదో పరవశంలో మునిగినట్లు నిశ్చలన చిత్రంలా వుండిపోయారు బాహ్య ప్రపంచాన్నే మరచి.

సరిగ్గా అప్పుడు ఆ వీధిలో నడుస్తున్న టునాట్ టు పోలీస్ పాపారావ్ కిటికీ లోంచి వీధిలోకి పడుతున్న దీపకాంతిని చూసి కొంచెం అనుమానంగా లోపలికి వచ్చాడు. ఆ ఇంటి కిటికీలోంచి చూశాడు దొంగలా. అతనికాదృశ్యం అగ్రహం తెప్పించింది.

ఎంత ధైర్యం ! కిటికీ కూడా ముయ్యకుండా ఇంత ధైర్యంగా వ్యభిచరించడమమంటే తనకీ తన డిపార్ట్‌మెంటుకి కూడా అవమానమే. వీడికి తన తడాకాచూపాలి. ఇంత బరితెగించిన వాడెవడో ? పరీక్షగా చూశాడు కళ్ళు చిట్లించి అరె! ముసిలాడు! అరవయ్యేళ్ళకి తక్కువుండవు. కలికాలం కాకపోతే ముసిలివాడికీవయసులో ముద్దు కావలసొచ్చిందా ? అందుకే కాబోలు తలలు బోడులయినా తలపులు బోడులౌనా అంటారు. ఎయిడ్స్ భయం కూడా లేనట్లుంది. కాటికి కాళ్ళు జాచుకున్నవాడికి ఏ భయముం టుంది. భయంలేని వాడికి భార్యయినా భోగందయినా ఒకటే. మన తాతది చల్‌మోహన్‌రంగా జాతయివుంటుంది. సరసానికి పిలువబోతే "బుద్దీలేదూ ఇంత వయసొచ్చినా? ఇంత ముసిలయినా అంటూ చివాట్లు పెట్టి " నీకు లేకపోయినా నాకు బుద్ధుంది పో " అని మూడంకేసేసి వుంటుంది ఇంటి ఆడది. మామ్మ మొండి కెయ్యడంతో తాత సానివీధిన పడ్డాడన్నమాట. తాతని కావలించుకున్న కక్కుర్తిదెవరూ ? అన్నట్లిది అప్పలనరసిల్లు కదూ? అప్పలనరస అంటే అమ్మమ్మ కాదూ. తాతకి శృంగారం అందిస్తూందా ! ఈ సారి అతని నిశితమైన చూపు ఆ జంటలోని స్త్రీ మీదపడింది. అప్పలనరసే..అమ్మమ్మే. అమ్మమ్మ, తాతయ్య భలే ! దొందుకి దొందే. ఇసక తక్కెడా పేడ తక్కెడా అన్నట్లు భలేసీను. ఫైన్. బ్లూ ఫిలిమ్‌లో కూడా ఇలాంటిది వుండదు. అప్పలనరస డబ్బుల కోసం ఒప్పుకొని ఉంటుంది. ఈ తాత మాత్రం వొళ్ళు కొవ్వెక్కో.. మదంతోనూ వచ్చుంటాడు అయితే మగాడికి ఎంత వయసు

వచ్చినా ఆడ యావ పోదన్నమాట అందుకే ఏమో తాతా ! పెళ్ళాడతావా ! అని అడిగితే "నాకెవరు పిల్లనిస్తార్రా!" అంటాడే కాని నాకీ ముసలితనంలో మనువేమిట్రా అని అనడట. ఇన్నాళ్ళూ ఇది తాతల మీద జోకనుకున్నాను కాని నిజమే అన్నమాట!

ఈ తాతనేడిపించాలి. పిల్లికి చెలగాటం, ఎలక్కి ప్రాణ సంకటం అనిపించాలతనికి. తన దెబ్బకతనికి బుద్ధి రావాలి మళ్ళీ ఎప్పుడూ ఇటు రాకుండా. ఈ ముసిలోళ్ళ దసరా పండుగేమిటో బాగోతం చూద్దాం. ఎయిడ్స్ గురించి ప్రజలకు తెలిశాక బ్రోతల్ హౌసులు సంసార కొంపలై పోయాయి. స్టేషనుకి కేసులూ తగ్గిపోయాయి. పోలీసులకి రాబడీ తగ్గిపోయింది బాగా.

అతను కిటికీ పక్కకి చీకట్లోకి జరిగాడు.

"అరె ఇప్పుడు మీ ఒళ్ళు ఏ మాత్రమూ వేడిగా లేదే !" ఆమెకి నమ్మబుద్ధి కాలేదు. "నిముషంలోనే ఎగిరిపోయిందా అంత ఉష్ణమూ అంత కాకా !

"ఎగిరిపోక! నీమాటలకీ నీ స్పర్శకీ తక్కువ శక్తుందా ? హృదయ పూర్వకంగా నన్ను తీసుకున్న నీ కౌగిలి.. మనస్ఫూర్తిగా ఆడినమాట.. దివ్య ఔషధాలే నాపాలిట" ఆనందంగా అన్నాడు.

"మీ మాటలు నాకేమీ అర్థం కావడం లేదు"

"అర్థమే కాదు, అన్నీ చెబుతాను నువ్వు వింటానంటే". ఆమె అయోమయంగా చూసింది.

"మౌనం అర్థాంగీకారం. నా కథా సొదా బాధా గాథా వినడానికి దయతో అంగీకరించావు. అందుకు నీకెన్ని కృతజ్ఞతలు తెలుపుకున్నా ఏమిచ్చినా నీ రుణం తీరదు."

కిటికీ అవతల పోలీసు విసుక్కున్నాడు. సందు దొరికితే చాలూ ప్రతివాడూ పెద్దస్పీకరే. వినేవాళ్ళు దొరకాలేకాని హరికథ చెప్పేసేవాడే. పూర్వకాలపు సినిమాల్లోలా అంతా డైలాగే, నో యాక్షన్ ఒరేయ్ ముసిలోడా ! ఉపోద్ఘాతాలూ ఊక దంపుడూ లేకుండా డైరెక్టుగా స్టోరీలో కొచ్చేస్తావో బతికిపోతావు. లేదో నా తడాఖా రుచి చూస్తావు. అనుకున్నాడు మనసులో. గదిలోని అతని కంఠం పోలీసుకి స్పష్టంగానే వినిపిస్తూంది. వాళ్ళు బాగానే కనపడుతున్నారు. "మనిషీ మరెన్నో ప్రాణులూ అమ్మ కడుపులో వుంటాయి మొదటి కొన్ని నెలలూ"

గొప్ప సత్యం చెప్పావు. నాకు తెలీదుస్మా ఇంత కొత్త సంగతి చెప్పినందుకు నీకు పద్మశ్రీ ఇవ్వవలిసిందే.

"ప్రసవించబడినాక మానవ శిశువు కొన్ని నెలలపాటు అమ్మవొడి, గుండెల్ని వదలదు అవెమ్మా, అక్కో, నాన్నో ఎవరో ఒక రెత్తుకోవల్సిందే. విడిగా వదిలేస్తే ఎత్తుకోమని ఏడుస్తారు. ఎందుకో తెలుసా? అని అడుగుతు న్నట్లు చూశాడు.

అబ్బా ! నీ సోదితో నన్నేడిపించేస్తున్నావు కదరా ముసలి నా కొడకా.

"ఎందుకు ? స్పర్శకోసం.. మానవ స్పర్శకోసం అమ్మవొంటి స్పర్శ శిశువుకి అమితానందాయకం, భరోసా. జంతువుల పిల్లలు కూడా అమ్మని అంటి పెట్టుకుంటూ వుండేవి ఈ మాత్ర స్పర్శకోసమే "

ఆమెకతను పిచ్చివాడేమో అని సందేహం

కలిగింది. చల్లకొచ్చి ముంతదాచుతాడే? ఇలా కథలు వినిపించడానికే డబ్బిస్తానన్నాడా అందుకయితే బోగందే ఎందుకు! అనవసరంగా పరువు తీసుకునేందుకు కాకపోతే. పాలు తాగేందుకయితే కష్టపడి తాటిచెట్టు కింద కెందుకూ రావడం ! వ్రతమూ చెడి ఫలము దక్కని పనెందుకు ?

"ముఖ్యంగా మనిషికి మరో మనిషి స్పర్శ ప్రాధమిక జీవితావసరమే" ప్రాణవాయువు లాంటిదే. గాలి, నీరు తిండి లాంటి ప్రధానావసరమే స్పర్శ కూడా. అంతే కాదు. జీవితంలో, మనిషి ఆరోగ్యంలో స్పర్శ ప్రధాన పాత్రే వహిస్తుంది." థీరీలు చెబుతున్నాడు తాత. కొత్త విషయం వింటున్నట్లు చూసిందామె .

తాతాస్ థీరీ.. పళ్ళు కొరుక్కున్నాడు పోలీసు.

"బడీడు వచ్చాక ఆటలలో తోటిపిల్లల స్పర్శ. భుజాల మీద చేతులేసుకుంటారు స్నేహితులు యవ్వనంలో భార్య స్పర్శ వృద్ధాప్యంలో మనవలనీ, మనవరాళ్ళనీ ఎత్తుకొని పొందే స్పర్శ. స్పర్శ అద్భుతమయిన అనుభవం. అనుభూతి. అంతేకాదు శారీరక భాషకూడా మామూలు భాష, మాటలు ప్రకటించలేని భావాన్నది సులభంగా క్షణంలో ప్రకటించగలదు. వెయ్యి మాటలు చెప్పలేనిది ఒక్క స్పర్శ చెప్పగలదన్నది అక్షర సత్యం.

శిరస్సుని నిమరడం - వాత్సల్యం

పెదవులపై ముద్దు - శృంగారం

కరచాలనం - స్నేహాభిమానాలు

భుజం చరచడం - అభినందన, ప్రోత్సాహం

వెన్ను నిమరడం - ధైర్యం చెప్పడం

కళ్ళు తుడవడం - జాలీ, ఓదార్పు

కౌగిలికి కోటి అర్థాలూ అనంత కోటి భావాలూ, స్పర్శ బహుముఖీ బహుళార్థ సాధకమూ ఎన్నైనా భావాన్నే చెప్పగలిగే బాడీ లాంగ్వేజ్.

పోలీసుకి అతని మాటలలో నిజం తోచింది. ఔను సుమా అనిపిస్తోంది. అనుభవిస్తున్న వాటినే కొత్త విషయాలలా చెబుతున్నాడు. చిత్రంగా చెబుతున్నాడు. (అంతా అప్పలనరసి లాటి అతి సామాన్యురాలి కని మరచిపోకు.)

"చేయి పట్టుకొని శరీర పరిస్థితి గ్రహిస్తాడు డాక్టరు. ఏ సందర్భానికా స్పర్శ. ఏ వయసుకా స్పర్శ అవలంభించకపోతే ఎంత అనర్థమూ అనారోగ్యమో నేనే నిదర్శనం. పుట్టుక కంటే కూడా ముందుదైన ఈ స్పర్శ బుద్ధి పుడకలతో కానిపోదేమో" చాటుగా వింటున్న పోలీసు. బాగానే చెపుతున్నాడు కాని వచ్చిన పని చేసుకుపోక ఈ పాతాల క్లాసుదేనికి ? అనుకున్నాడు.

" నా వయసు అరవై ఒకటి భార్యపోయి పదేళ్ళయింది."

'అయ్యో పాపం !' పోలీసుకి కూడా కొంచెం జాలివేసింది. పదేళ్ళ నుంచి ఆడ సుఖం లేకుండా ఉండడం ఎలాంటి వాడికైనా కష్టమే. ఆడవాళ్ళకి వుండే నిగ్రహం మగవాళ్ళకుండదు.

" ఒక కొడుకు, వాడికిద్దరూ పిల్లలు మగా, ఆడా రిటైరవడంతో అంటే మూడేళ్ళ కిందటే నన్నీ నగరానికి తీసుకొచ్చేశారు. ఒక్కడినీ అక్కడెందుకని తమతో పాటుండమనీ. ఒంటరితనం - ముఖ్యంగా రాత్రివేళ నిద్రపట్టదు. కాళ్ళ

పీకులు, వంట్లో ఏదో గుబ గుబ, గుబులు, నరాలలో కాక, శరీరంలో అసౌకర్యం.. చికాకు.. అస్థిమితం.. ఏదో తెలియని చెప్పలేని బాధ, భయం వైరాగ్యం విచారం."

"డాక్టరుకి చూపించుకోలేదూ ? అడిగింది అప్పలనరస.

"చూపించుకున్నాను 'టెంపరేచరూ, బి.పి నార్మల్ వంట్లో ఏమీ లేదనేశారు."

"మరెందుకలా అవుతోంది ? ఆమె జాలిగా అడిగింది. కంఠంలో కొంచెం ఆత్రం."

"నన్ను నేనే విశ్లేషించుకుని.. మెల్లగా కారణం గ్రహించుకున్నాను."

'ఏమిటా కారణం"

"నా శరీరం మానవ స్పర్శను తీవ్రంగా కోరుకుంటుంది. అన్నట్లు ఒక విషయం తెలుసా!

కొన్ని జంతువులు - గేదెలాంటివి.. ప్రసవించ గానే తన సంతానాన్ని ఒళ్లంతా నాకుతాయి.

"పెయ్య లేదా దూడని శుభ్రం చేసెయ్యడా నికి" "కాదు అలా నాకడం వలన ఆపెయ్య మూత్రపిండాలూ, విసర్జకావయవాలు చక్కగా పనిచేస్తాయి. నాకు రెండు అవసరాలు తీరాలి. ఒకటి స్పర్శ రెండోది మాట...

"నాకర్థం కాలేదు బాగా చెప్పండి"

"మనవడు.మనవరాలు..లేదా మరెవరిద యినా సరే సజీవ మానవ స్పర్శతోనే నా అసౌకర్యం తీరుతుంది. దేహం శాంత పడుతుంది కాక తగ్గి. అలాగే నాతో మాట్లాడే నా మాటలు వినే మనిషి కూడా కావాలి."

"కొడుకు, కోడలు వున్నారుగా?" "నన్నిక్కడికి తీసుకొచ్చి పడేశారే తప్ప నాతో మాట్లాడడానికి వాళ్ళకు తీరిక వుండదు. ఇష్టమూ వుండదు. వెనుకటి తరానికి చెందిన నేను వాళ్ళ దృష్టిలో అనాగరికుణ్ణి. పల్లెటూరి బైతునీ" వృద్ధుడి కంఠంలో దుఃఖం.

"పోనీ వాళ్ళ పిల్లలని చేరదీసి ఆడుకోవచ్చు గా?"

" వాళ్ళు తెల్లగా దొరల పిల్లల్లా వుంటారు. నేనేమో నల్లగా ఉంటాను. పైగా ఈ నగరంతో పోలిస్తే నేనుండి వచ్చిన చిన్నపట్నం పల్లెటూరి కిందే జమ. నేను వాళ్ళ దృష్టిలో బైతునీ, ముసలితొక్కునీ, నాకేమీ తెలియదు. నాలాంటి వాడు వాళ్ళ బిడ్డల్ని ముట్టుకుంటే నా నలుపూ, మాట్లాడితే నా తెలివితక్కువతనమూ వాళ్ళకంటు కుంటాయని నేను వాళ్ళకు దూరంగా వుండాలని ఆంక్షలు విధించారు కొడుకూ, కోడలూ.."

" ఆ! తాతా మనవల్ని దూరం చేయడమా! ఒకింట్లోనే వుంటూ.."

అయ్యో తాతా ! ఇది నిజంగా కష్టమే.. నిట్టూర్చాడు పోలీస్.

"నేనేమో మానవ స్పర్శకోసం వాచిపోతున్నా ను. అది కరువయ్యే నానా బాధలూపడుతు న్నాను."

"పైవాళ్ళ పిల్లలు పోనీ కాస్త శుభ్రంగా వుండే ముష్టిపిల్లలూ వాళ్ళని చేరదియ్యొచ్చుగా."

"ఆ ఆలోచన నాకు రాకపోలేదు. కాని ఆ మధ్య ఈ వూళ్లోనే ఒక ఉదంతం బయటపడి వృద్ధులందరూ తలవొంచుకోవలసిన పరిస్థితి కల్పించింది."

"ఏమిటది ? ఏం జరిగింది?"

"విషయమే తప్ప పేర్లూ వివరాలూ గుర్తులేవు, వృద్ధాప్యం కొద్దీ వచ్చిన మతిమరుపు వల్ల. ఒక వయసు మీరిన వాడు పేరు ఆలియాస్ అనుకుంటాను వికలాంగ బాలబాలికల సంరక్షణ గృహం ఏర్పాటు చేసి విదేశం నుంచి నిధులు పోగుచేసుకునేవాడు. అంతే అయితే బాగానే వుండేది. ఆ వృద్ధుడు అభమూ, శుభమూ ఎరగని చిన్నపిల్లల మీదా వికలాంగులూ, నిస్సహాయులు, అనాధలూ అయిన ఆశ్రమ బాలబాలికల మీద లైంగిక అత్యాచారాలు చేసి, బయటపెడితే చంపేస్తానని వారిని బెదిరించి నోరు మూయించే వాడట. పాపం, నేరం ఎన్నాళ్ళు దాగుతాయి ? ఆ దుర్మార్గాలు బయటపడ్డాయి అతన్ని అరెస్టు చేసినట్లు కూడా పేపర్లో రాసినట్లు జ్ఞాపకం."

"ఛీ! పశువులు కూడా అలా ప్రవర్తించవే"

"పశువులు సాధారణంగా తప్పు చెయ్యవు. చేసేది మనుషులే. సరే వార్తా పత్రికలు ఆ సంఘటనకు ఎంత ప్రచారమిచ్చాయంటే.. చదివిన ప్రజలు – ప్రతివృద్ధుడూ చిన్నపిల్లల మీద అత్యాచారాలు జరపడానికే చూస్తాడని నమ్మేసేటంతగా , వృద్ధులందరినీ ఒకే గాటికి కట్టేసి అపార్థం చేసుకునేంతగా, జరిగిందా విషయానికి ప్రచారం. తా చెడ్డ కోతి వనమెల్లా చెరచిందన్నట్లు ఆ వృద్ధుడూ మొత్తం అందరి వృద్ధుల గౌరవాన్నీ మంట కలిపి వదిలాడు తన ప్రవర్తనతో. కనుక నేను పరుల పిల్లలని చేరదియ్యడానికి భయపడి ఆ ప్రయత్నం విరమించుకున్నాను."

నిజమే అనుకున్నాడు పోలీసు కూడా.

"ఇక నాకు మానవ స్పర్శ లభించెదెలా ? ఈ వూరితో నా పరిచయమూ స్వల్పకాలమే కనుక భుజం మీద చెయ్యివేసి మాట్లాడే స్నేహితులూ లేరు. నవ్వుకోనంటే, నమ్ముతానంటే ఒక నిజం చెబుతాను సిగ్గువిడిచి."

"ఏమిటి" పోలీసు కూడా ఉత్కంఠగా ఎదురు చూడసాగాడు అదేమిటో వినాలని.

"సజీవ మానవ స్పర్శ కోసమూ, మాటలు కోసము నేను పడుతూ వస్తున్న ఆత్రతా, ఆరాటమూ, అలమటింపు జన్మలో తీరవన్న నిరాశ నన్నావరించి ఆత్మహత్య చేసుకుందామనుకున్నాను. ఈ నగరంలో ఆత్మహత్య చేసుకోవడం కూడా సులభం కాదు సామాన్యుడికి. సముద్రమొక్కటే సులభమైన ఆత్మహత్యా సాధనం అనిపించి కాలినడకన ఇంటి నుంచి బయలుదేరాను. నాకీ తోవలు తెలియవు. చావబోయే వాడికి సముద్రం మోకాలి లోతు. ఎంత దూరమైతే నాకేంటి అనుకొని నడుస్తూ తెలియకుండానే ఈ వీధిలోకి వచ్చాను. గుమ్మం గుమ్మం ముందూ ఒకామె. నేను పవిత్రుడినే కాని ఇలాంటి వీధిలో ఎవరుంటారో ఎందుకుంటారో తెలియనంత అమాయకుణ్ణీ. అజ్ఞానినీ కాను. చదువుకున్నవాడినే కదా. ఆ స్త్రీలను చూశాక నాకొక ఆలోచన కలిగింది అప్పటికప్పుడు." "ఏమిటా ఆలోచన"

"నేనింతగా తపించిపోతున్న స్పర్శ వీళ్లిస్తారు కదా? ఆత్మహత్య కంటే అది నయమే కదా అనిపించింది. మనిషి ఎంత ముసలివాడయినా ఏమైనా ప్రాణం మీద తీపి మాత్రం త్వరగా చావదు కాబోలు. సరే. మెల్లగా ఒక్కొక్కరి ముఖం చూసుకుంటూ ఈ వీధిలో నడవసాగాను. ఎందుకో వాళ్ళెవరూ నా బాధనీ,

హృదయాన్నీ అర్థం చేసుకోగలిగేవారిలా అనిపించలేదు. నాకంటే వాళ్ళు చాలా చిన్న వాళ్ళవ్వడం వల్ల కావచ్చు. లేదా వాళ్ళు చాలా వ్యాపారాత్మకంగా కనిపించడం వల్లనే కావచ్చు. చివరికి మీరు.. నువ్వు కనిపించావ్ నీలో.. పెద్దత నం.. నా సొదవిని.. నన్నర్థం చేసుకొని నాకు కావలసింది ఇవ్వగలదానివి నువ్వే అని ఆశ పుట్టింది. అందుకే నీ దగ్గర ఆగి నిన్ను పలకరించాను. నిజం చెపుతున్నాను. నీలో నాకు అమ్మ కనిపించింది, చెల్లి కనిపించింది. నా నమ్మకాన్ని , అంచనాన్నీ, ఆశనీ నువ్వు భగ్నం చెయ్యలేదు. అమ్మలాగే నా చెయ్యిపట్టుకున్నావు. చెల్లిలాగే నా నొసట చెయ్యి వేసి ఉష్ణం చూశావు. అమ్మాయిలా నా వెన్ను నిమిరావు, అప్పురాలిలా, ఆత్మీయురాలిలా నన్ను హృదయానికి హత్తుకొని సేద తీర్చావు. నా ఆర్తిని, తహతహని, తపనని, ఆరాటాన్ని ఉపశమింపచేశావు. నువ్వు నా అమ్మవి. నా మాటలని ఓపిగ్గా విన్నావు. నువ్వు నా అక్కవి. ఇప్పుడు నాకెంత హాయిగా ఉందో చెప్పలేను. తనువూ, మనసూ కూడా ఎంత తేలికపడ్డాయో వివరించలేను." "అతని కళ్ళవెంట నీళ్ళు" గుండెనిండా వేదనంతా బయటకు వచ్చేస్తున్నట్లు.

కథ అయిపోతుందనిపించింది పోలీసుకి .ఆలస్యం అమృతం విషం అనుకున్నాడు.

. అతని కథ – నిజమే కావొచ్చు. కాని తను పోలీసు. టునాట్టు డ్యూటీలో ఉన్న పోలీస్ కానిస్టేబుల్. కిటికీ పక్కనుంచి అడుగేసి తలుపు మీద లాఠీతో కొట్టాడు.

ఆ శబ్దం ఏ ప్రమాదానికి సంకేతమో తెలిసిన అప్పలనరస కంగారుపడింది. ఆమె ఏదో అనబోయేంతలోనే ఆ వృద్ధుడు తలుపు తెరిచాడు. ఎదురుగా పోలీస్ ! నిర్ఘాంత పోయాడు.

"వ్యభిచారం నేరం. ఆ నేరం చేస్తున్న నిన్ను స్టేషన్‌కి పదమంటున్నాను" కఠినంగా అన్నాడు.

"అదికాదు నేను...నేరం" "మరిక్కడికి ఎందుకు వచ్చావు ?"

"మరీ..మరీ" అవమానంతో ఆ వృద్ధుడి గొంతు పూడుకుపోయింది. అది కాదు ఏదో చెప్పడానికి ప్రయత్నించింది అప్పలనరస.

"నీమాట మీద వదిలేస్తాను. కానీ అందుకు ఖర్చవుతుంది ఏభై." మరోమాట లేకుండా జేబులోని నోటు తీసి అతనికందించేశాడు బ్రతుకు జీవుడా అన్నట్లు. పోలీసు డబ్బు అందిందే చాలని వెనక్కితి రిగాడు వెళ్ళేందుకు. వృద్ధుడు అతన్ని అనుసరించబోతుంటే "బాబూ ! పిలిచిందామె.

"నన్ను క్షమించు. అవసరమైతే ఆటోకుం టుందని ఆ ఏభయ్యే వేసుకొచ్చాను, చావబోయే వాడికి అంతకంటే ఎందుకని. కాని తోవలో నా జీవితం మలుపు తిరిగింది. నువ్వే తిప్పావు. ఆ రుణం తీర్చుకుందుకైనా ప్రస్తుతం నేను నిర్ధను ణ్ణి. నీకేమీ ఇవ్వలేకుండానే వెళ్తున్నందుకిప్పటికి మన్నించు"

"కొడుకుని ప్రేమించే అమ్మా, తమ్ముడ్ని అభిమానించే అక్క అందుకు డబ్బు తీసుకుంటా రా ! వుండు బాబూ ! ఆటోలో వెళ్ళేందుకు.." అంటూ చీరకొంగు నుంచి పదిరూపాయల నోటు తీసిచ్చి "ఎంత దూరం వెళ్ళాలో ఏమో నా దగ్గర ఇంతకంటే లేదు మరి" అందామె. ఎంతోనొచ్చుకుంటున్నట్లు.

"అమ్మా ! అని ఆమె చేతులందుకొని కళ్ళకద్దుకున్నాడతను కళ్ళ వెంట నీటిధారలు కారుతుండగా.

సమాప్తం